క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల బదిలీ నిబంధనలు సడలించాలి



దేవరపల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

దేవరపల్లి: గ్రామ సచివాలయాల ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిబంధనలు సడలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం దేవరపల్లి మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు స్థానిక మండల పరిషత్, తహసల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రాజారావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పదోన్నతుల తర్వాత బదిలీలు జరగాలని, సొంత మండలానికి బదిలీకి అవకాశం కల్పించాలని, ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, జీఓ నంబర్ 5ను రద్దు చేయాలని, అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఇవ్వాలని, రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు పంపించి కటుంబాలకు దూరం చేయడం తగదని, ఉద్యోగుల్లో ఉన్నత విద్యావంతులు ఉన్నందున సీనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇవ్వాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పై డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు మురళి, స్వరూప్, అచ్చమ్మ, వేణి, రవికుమార్, ఈశ్వర్, దీపక్, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలి

నిడదవోలు రూరల్: గ్రామ సచివాలయ ఉద్యోగులకు స్పష్టమైన సర్వీస్ రూల్స్ కల్పించి న్యాయం చేయాలని ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర నాయకులు వి.జీవన్‌సాగర్, టి.దుర్గాప్రసాద్, డి.విజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ జగన్నాథరావుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. సచివాలయ ఉద్యోగులను పంచాయతీల పరిధిలోని బదిలీలు చేపట్టాలని, అంతర జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని, పదోన్నతులు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు రియాజ్, అజయ్, ప్రదీప్, గణపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

తాళ్లపూడి: పైడిమెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పలువురు దాతలు సంవత్సరానికి సరిపడా నోట్ పుస్తకాలను మంగళవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు డి. దుర్గారావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు దాతలు పసలపూడి నాని బాబు, జొన్నకూటి పాపారావు, ముప్పిడి రాజు ఈ పుస్తకాలు సమకూర్చారు. ఈ సందర్భంగా దాతలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నకూటి నాగేశ్వరరావు, ముప్పిడి రాజు, పసలపూడి ప్రవీణ్, ఎపాఠశాల కమిటీ చైర్మన్ కొప్పాక నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకం

ఉండ్రాజవరం: మాస శివరాత్రి, త్రయోదశి సందర్భంగా ఉండ్రాజవరంలో శ్రీబాల త్రిపుర సుందరి దేవి సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి ప్రదోషకాలంలో శ్రీనందీశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి అభిషేకాన్ని వీక్షించి, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మద్దిరాల తారక వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి నెల అమావాస్య ముందు వచ్చే త్రయోదశి రోజున నందీశ్వరుడుకి అభిషేకం చేస్తే గ్రహ దోషాలు తొలగుతాయని తెలిపారు.

దేశాభివృద్ధే ధ్యేయంగా మోదీ పాలన

తాళ్లపూడి(కొవ్వూరు): సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం, దేశాభివృద్ధే ధ్యేయంగా నరేంద్ర మోదీ పాలన కొనసాగుతోందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం సుందర గోవిందుడిని కళావేదిక వద్ద మంగళవారం ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ హయాంలో 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బోడపాటి ముత్యాలరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కోడూరు లక్ష్మీనారాయణ, పరిమి రాధాకృష్ణ పాల్గొన్నారు.

నారు దశ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

ఉండ్రాజవరం: రైతులు నారు దశ నుంచి జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు అన్నారు. మండలంలో పాలంగిలో మంగళవారం సర్పంచ్ బి.శ్రీనివాసు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో 935 మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్ష కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ఆ ఫలితాలు వచ్చిన తరువాత వాటిని రైతులకు అందిస్తామన్నారు. ఆ ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని, తద్వారా ఖర్చు తగ్గడంతో పాటు పంటకు అవసరమైన పోషకాలను అందించవచ్చని తెలిపారు. నారు మడులు సస్యరక్షణ, యాజమాన్యంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన నారు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సహాయకులు కాంతి, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఏటిగట్టు.. నట్టేట ముంచేట్టు

- విజ్జేశ్వరం– పెండ్యాల వరకు బలహీనపడిన ఏటిగట్లు
- పటిష్టతకు చర్యలు తీసుకోవాలంటున్న గోదావరి తీర ప్రాంత ప్రజలు
- భారీ వాహనాల్లో ఇసుక రవాణా కారణంగా రోడ్లు ధ్వంసం



పెండ్యాల వద్ద గోతులమయమైన ఏటిగట్టు రోడ్డు

నిడదవోలు రూరల్: గోదావరికి వరదలు వస్తున్నాయంటే నదీ తీరంలోని గ్రామ ప్రజల్లో కలవరం మొదలవుతుంది. లంక భూముల్లో విలువైన పంటలు ఏటా మునిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక పక్క భారీ వర్షాలతో ఏటిగట్లు నెర్రలు తీస్తుంటే, మరో పక్క గండ్లు పడి ఏటిగట్టు పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. ముందస్తు చర్యల్లో భాగంగా ఏటిగట్టుకు మరమ్మతులు చేయకపోవడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని నదీ పరివాహక ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల అక్రమ ఇసుక దందాకు ఏటిగట్లు వినియోగం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో 2008లో ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకున్నారు. నిడదవోలు విజ్జేశ్వరం నుంచి పెండ్యాల వరకు సుమారు 15 కిలోమీటర్ల విస్తరించి రూ.25 కోట్లతో ఏటిగట్టును అభివృద్ధి చేశారు. ఈ తర్వాత సరైన నిర్వహణ లేకపోవడంతో ఏటిగట్టు అంచుల్లో మట్టి కొట్టుకుపోయి బలహీనంగా మారింది. కొన్నేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా గట్లు పాడయ్యాయి. టీడీపీ ప్రభుత్వంలో అక్రమ ఇసుక దందాకు భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఈ ఏటిగట్లు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.



పెండ్యాల వద్ద కుంగిన ఏటిగట్టు మార్జిన్లు



పందలపర్రు వద్ద ఏటిగట్టుకు గండి

రూ.64 కోట్లు మంజూరు చేసిన మాజీ సీఎం జగన్

కాపు నేస్తం కార్యక్రమం ప్రారంభానికి నిడదవోలు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఈ ఏటిగట్టు రోడ్డు దుస్థితిని తీసుకువెళ్లడంతో రూ.64 కోట్లు మంజూరు చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని ప్రజలంతా ఎదురుచూస్తుండగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది కాలంలో అక్రమ ఇసుక దోపిడీకీ ఈ ఏటిగట్టునే ఉపయోగించుకున్నారు. గట్ల అభివృద్ధిని మాత్రం కూటమి నాయకులు విస్మరించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఏటా జూలై, ఆగస్టు నెలల్లో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరదనీరు చేరి ఏటిగట్లను తాకుతుంది. దీంతో పుష్కరస్నాన ఘట్టాలతో పాటు పెండ్యాల, విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, జీడిగుంట గ్రామాల పరిధిలోని లంక పొలాలు ముంపునకు గురవుతాయి. ఇప్పటికే ఏటిగట్టుకు అడుగడుగునా మార్జిన్లు కుంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. గట్టు కింది నుంచి నెర్రల నుంచి నీరు రావడంతో పొలాలు ముంపు బారిన పడుతున్నాయని, గోదారికి వరద వచ్చినప్పుడు నెర్రల వద్ద గండిపడితే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉంటుందని పరిసర గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఆక్రమణలు

గోదావరి గట్టు వెంబడి ఆక్రమణలు పెరిగిపోయాయి. గట్టును తవ్వేసి అక్రమంగా ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసుకునేందుకు రావివారిపాలెం వద్ద బాటలు ఏర్పాటు చేశారు. పశువులకు పచ్చగడ్డి పెంచుకోవడంతో పాటు పొలాలకు రోడ్లు వేసుకునేందుకు మట్టిని తవ్వేయడంతో గట్టు కుంచించుకుపోయాయి. దీంతో రాత్రివేళల్లో ఏటిగట్టు నుంచి వాహనాలు జారిపడి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం మోటార్‌సైకిల్‌పై కూడా వెళ్లడానికి స్థానిక రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏటిగట్టు ఆక్రమణలకు గురై అడుగడుగునా గుంతలు కనిపిస్తున్నా పటిష్టతకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నడిచి వెళ్లేందుకూ ఇబ్బందే..



భారీ వాహనాల రాకపోకలతో ఏటిగట్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షం వస్తే లంకల్లోని పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో నిల్వచేసిన ఇసుకను అక్రమంగా భారీ వాహనాలతో ఈ గట్లపై నుంచి తరలించారు. ఇప్పటికైనా స్పందించి ఏటిగట్లు పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పులుమంతుల రామారావు, పందలపర్రు

ఇసుక మేటల తొలగింపునకు చర్యలు



ప్రక్కిలంకలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి: ప్రక్కిలంక రెవెన్యూ పరిధిలోకి వచ్చే గోదావరి లంక భూముల్లో మేటలు వేసిన ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతుల కోసం పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. 31.95 హెక్టార్లలో ఇసుక మేటలు తొలగించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ రైతుల అర్జీ మేరకు ఇసుక మేటలను సెమీ మెకనైజ్డ్ యంత్రాలతో తొలగించే అవకాశం ఉందని, నేరుగా కొంతమంది అభిప్రాయాలు వెల్లడించారని, వాటితో పాటు ఈ కార్యక్రమంపై 24 గంటల వరకు రాత పూర్వకమైన అభ్యంతరాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనూ స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాలు, రవాణా విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రక్కిలంక గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పేర్కొన్నారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, మైనింగ్ శాఖ ఏడీ ఫణిభూషన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి లావణ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సూరాపురంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, త్రీ ఫేస్ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 25 తేదీ బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలి



నిడదవోలులో ప్రైవేట్ విద్యా సంస్థల వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు : బాలల ఉచిత నిర్బంద విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)12(1)సీ ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఓ విద్యాసంస్థల వద్ద మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎక్కడా 25 శాతం సీట్లు కేటాయించడం లేదని, విద్యాహక్కు చట్టం అమలు చెయ్యకుండా విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు ఆరోపించారు. పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలపై తిమ్మరాజుపాలెంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో సీపీఎం బృందం పరిశీలించింది. విద్యాహక్కు చట్టాన్ని అమలు చెయ్యకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు బయట పడిందని నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాలు లెక్క చేయకుండా వ్యవహరిస్తున్న కొన్ని విద్యా సంస్థల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలని జీవో నంబర్ 53, 54 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కన్నా అధికంగా ప్రైవేటు యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఒక వైపు ప్రభుత్వం ఉచిత సీట్లు ఉపయోగించుకోండి అని ప్రకటిస్తున్నా ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీ కొనసాగుతోందని, దీనిపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి గారపాటి ప్రసన్న కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి తానేటి వనిత జన్మదిన వేడుక



యర్నగూడెంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత జన్మదిన వేడుకలు మంగళవారం యర్నగూడెంలోని ఆర్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల నాయకులు ఏర్పాటు చేసిన 50 కిలోల నాలుగు కేక్‌లను వనిత కట్‌చేసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు పంచారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు తరలివచ్చి వనితకు పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఆమె తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆర్ కన్వెన్షన్ హాల్ వద్ద జంగారెడ్డిగూడెం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తానేటి వనిత ప్రారంభించారు. శిబిరంలో సుమారు 50 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కృష్ణంపాలెం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పార్టీ నేతలు వస్త్రాలు పంపిణీతోపాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె. సునీత, గోపాలపురం కొండవీటి విద్యాసంస్థల అధినేత కొండవీటి ఆశీర్వాదం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, పాల్గొన్నారు. మాజీ మంత్రి తానేటి వనిత కుటుంబ రాజకీయ నేపథ్యం, గోపాలపురం ఎమ్మెల్యేగా, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, హోం మంత్రిగా గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి, ఆమె రాజకీయ ప్రస్థానంపై రూపొందించిన డాక్యుమెంటరీని ఆమె ఆవిష్కరించారు.

ఈదురు గాలులకు విరిగిన అరటి చెట్లు



ముక్కామలలో విరిగిన అరటి చెట్టుకు ఉన్న లేత గెలను చూపిస్తున్న రైతు వెంకటేశ్వరరావు

పెరవలి: పెరవలి మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలుల ధాటికి అరటి చెట్లు విరిగిపోయాయి. రాత్రి 10 గంటలకు హఠాత్తుగా ఈదురు గాలులుతో కురిసిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించిందని రైతులు తెలిపారు. గాలులు సుడులు తిరగడంతో అరటి బొందలు విరిగిపోయి నేలకొరిగాయని వారన్నారు. చేతికి వచ్చిన పంట నోటికి దక్కకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మండలంలో ముక్కామల, ఖండవల్లి, కాకరపర్రు, తీపర్రు గ్రామాల్లో అరటి పంటకు భారీగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 25 ఎకరాల వరకు అరటి పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ముక్కామలకు చెందిన ముళ్లపూడి వెంకటేశ్వరరావు అరటి తోటలో 500, వేండ్ర సూర్యనారాయణ, మోటుపల్లి రామస్వామి, మొల్లేటి శ్రీను అరటి చేలల్లో 200 నుంచి 300 బొందలు విరిగిపోయాయని తెలిపారు.

సాగులో యాంత్రీకరణతో ఖర్చు ఆదా

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- డ్రోన్‌తో విత్తనాలు నాటడంపై డెమో



బందపురంలో డ్రోన్‌తో నవధాన్యాల విత్తనాలు నాటుతున్న వ్యవసాయాధికారులు



వీడర్‌తో విత్తనాలు వేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

దేవరపల్లి: ప్రకృతి వ్యవసాయం, యాంత్రీకరణతో ఖర్చు, సమయం ఆదా అవుతాయని, వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం, వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బందపురంలో డ్రోన్‌తో విత్తనాలు నాటడం, వీడర్ ద్వారా కిచెన్ గార్డెన్‌లో తక్కువ సమయంలో మనుషులతో పనిలేకుండా దుక్కు తయారు చేయడం, విత్తనాలు వేయడంపై డెమో నిర్వహించారు. జిల్లా స్థాయిలో ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడారు. యాంత్రీకరణలో భాగంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో నూతన పద్ధతులు తీసుకు వస్తున్నట్టు తెలిపారు. కూలీల కొరతను తొలగించడానికి యాంత్రీకరణ విధానం ప్రవేశపెట్టామన్నారు. గ్రామాల్లో రైతు స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటు చేసి రాయితీపై యంత్రాలను అందజేస్తామన్నారు. డ్రోన్ ద్వారా ఎకరం విస్తీర్ణంలో 8 నుంచి 10 నిమిషాల్లో విత్తనాలు వేయవచ్చన్నారు. 20 నుంచి 40 సెంట్ల స్థలంలో ప్రకృతి వ్యవసాయంలో కూరగాయల పంటలు సాగు చేసి, నెలకు రూ.10 నుంచి 20 వేలు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జిల్లాలో ప్రథమంగా..

ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రథమంగా బందపురంలోని రైతు కాట్రగడ్డ గాంధీకి చెందిన పది ఎకరాల పొగాకు సాగు భూమిలో డ్రోన్ ద్వారా 15 రకాల నవధాన్యాల విత్తనాలను నాటినట్టు తెలిపారు. దీని వల్ల రైతులకు సమయం కలిసి వస్తోందని, తక్కువ ఖర్చు అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. కృషివల కోకోనట్ రైతుల ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ అడ్డాల గోపాలకృష్ణ మాట్లాడుతూ జీవన ఎరువులు, అన్నిరకాల ఎరువుల గురించి వివరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్, ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు



ముక్కామలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శేఖర్‌బాబు

పెరవలి: ప్రతి ఒక్కరికీ సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో డిజిటల్ గ్రంథాలయాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని దానికి అనుగుణంగానే గ్రంథాలయాలను సిద్ధం చేస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యం శేఖర్‌బాబు తెలిపారు. పెరవలి మండలం ముక్కామల శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 74 శాఖా గ్రంథాలయాలున్నాయని వీటిలో ఇప్పటికే కంపూటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని విద్యార్థులు వినియోగించుకుంటున్నారని, ప్రతి గ్రామంలో డిజిటల్ గ్రంథాలయాలు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని తణుకులో రూ.1.03 కోట్లతో గ్రేడ్ 1 గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించామని వివరించారు. జిల్లాలో పుస్తక నిక్షిప్త కేంద్రాలు 95 ఉన్నాయని ఇవి మరిన్ని పెంచటానికి చర్యలు చేపడతామని వివరించారు. స్థానిక ఎంపీడీఓ పద్మజతో ఆయన మాట్లాడుతూ ఈ మండలంలో లైబ్రరీ సెస్ కొన్నేళ్లుగా చెల్లించడం లేదని వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ యు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డుపై గోతుల పూడ్చివేత



ప్రక్కిలంకలో రోడ్డుపై గోతులు పూడ్చివేతను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ పోశిరాజు, బాబూరావు

తాళ్లపూడి: ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గోతులను వైఎస్సార్ సీపీ నాయకులు, మండల జేఏసీ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు, ప్రక్కిలంక సర్పంచ్ యాళ్ల స్వప్న చొరవతో మంగళవారం చేపట్టారు. కొంతకాలంగా ఆటోనగర్ వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గోతుల కారణంగా వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్పందించిన వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబూరావు, ప్రక్కిలంక పంచాయతీ కార్యదర్శి నంది రాజు, సర్పంచ్ యాళ్ల స్వప్న దృష్టికి తీసుకుని వెళ్లగా వెట్ మిక్స్ తెప్పించి తాళ్లపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు పర్యవేక్షణలో గోతులను పూడ్చివేశారు.

5న జాతీయ లోక్ అదాలత్

తాళ్లపూడి(కొవ్వూరు): వివాదాలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి జులై 5న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. కొవ్వూరు కోర్టు హాల్‌లో మంగళవారం బార్ అసోసియేషన్ సభ్యులతో 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ సమేవేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేయాలని కోరారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. బార్ ప్రెసిడెంట్ వి.ఎస్ నాగమధు, న్యాయవాదులు చిట్టి బాబు పాల్గొన్నారు.

అధికారులు మెరుగైన పనితీరు కనబర్చాలి

తాళ్లపూడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనపరమైన అన్ని అంశాల్లోనూ అన్ని శాఖల సిబ్బంది మెరుగైన పనితనాన్ని కనబరచాలని తాళ్లపూడి ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన వారిని ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పరిచయం చేసుకుని విధుల నిర్వహణలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

తాళ్లపూడి: మండలం నుంచి త్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్‌బుస్రా నూజివీడు త్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. మలకపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జొన్నకూటి అజయ్‌కుమార్ శ్రీకాకుళం క్యాంపస్, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ తరీఫా ఒంగోలు క్యాంపస్, పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. సాత్విక్ హర్ష నూజివీడు క్యాంపస్, , తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.చరణ్‌సాయి ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో బాలామణి , ఎంఈవో 2 సీహెచ్ నెహ్రూజీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.





జొన్నకూటి అజయ్‌కుమార్ ఎస్‌కే అమిర్

ముక్కామల విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ముక్కామలలో వీరవల్లి కావ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెరవలి: ముక్కామల ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వీరవల్లి కావ్యకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.విగ్నేశ్వరరావు తెలిపారు. కావ్య ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం అభినందనీయమని, ఉన్నత విద్యలో రాణించి గ్రామానికి మంచిపేరు తీసుకు రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు కావ్యను అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి కోరుమామిడి విద్యార్థి ఎంపిక

నిడదవోలు రూరల్: కోరుమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 574 మార్కులు సాధించిన ఎస్‌కే అమిర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ కేవీ గణేష్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అమిర్‌ను ప్రధానోపాధ్యాయురాలు వి.లక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.